www.samasamajam.in

# సమ సమాజం

శుక్ర వారం 27-1-2023

సంపుటి - 07, సంచిక-242
పేజీలు - 4 వెల రూ. 5/-

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole



## బాసరలో ఘనంగా వసంతపంచమి వేడుకలు



అక్షరాభ్యాసాలకు బారులు తీరిన పిల్లలు

పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి



**బాసర, జనవరి 26 (సమ సమాజం):** చదువుల తల్లి బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో వసంత పంచమి వేడుకలు వైభవంగా సాగాయి. విద్య, సంగీతం, కళలకు దేవత అయిన సరస్వతీ దేవి జన్మించిన రోజు కావడంతో అమ్మవారి 3వ

## టీచర్లకు గుడ్ న్యూస్

### నేటి నుంచే టీచర్ల బదిలీ ప్రక్రియ

గైడ్‌లైన్స్ విడుదల చేసిన ప్రభుత్వం



**హైదరాబాద్,జనవరి 26 (సమ సమాజం):** గణతంత్ర దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం టీచర్ల బదిలీలు, ప్రమోషన్లపై గైడ్ లైన్స్విడుదల చేసింది. రాష్ట్రంలోని టీచర్ల బదిలీలకు సంబంధించిన జీవో నెం. 5 ను విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ జారీ చేశారు. అయితే టీచర్ల పదోన్నతులు, బదిలీల పక్రియ శుక్రవారం నుంచే ప్రారంభమవుతుందని వాకాటి అరుణ ఈ ప్రకటనలో స్పష్టం చేశారు. దరఖాస్తులను 3వ

## కర్తవ్యపథ్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు

### త్రివర్ణ పతాకం ఆవిష్కరించిన రాష్ట్రపతి ముర్ము

ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈజిప్టు అధ్యక్షుడు అద్బెల్ ఫతా

ఆకట్టుకున్న ఆర్మీ పరేడ్..





**న్యూఢిల్లీ, జనవరి 26 (సమ సమాజం):** కర్తవ్య పథ్‌లో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం త్రివిధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. జాతీయ గీతం ఆలపించిన అనంతరం 21 గన్ సెల్యూట్ స్వీకరించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఈజిప్టు అధ్యక్షుడు అద్బెల్ ఫతా హాజరయ్యారు. రిపబ్లిక్ డే వేడుకల్లో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్, ప్రధాని నరేంద్రమోడీ, పలువురు కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. రాజ్ పథ్ పేరును కర్తవ్య పథ్ గా మార్చిన అనంతరం తొలిసారి నిర్వహిస్తున్న గణతంత్ర వేడుకల్లో పరేడ్ ఆకట్టుకుంది. ఈసారి ఈజిప్ట్ కు చెందిన సైనిక దళాలు పరేడ్ లో పాల్గొన్నాయి. గణతంత్ర 3వ

## ప్రజాస్వామ్య బద్ధంగా తెలంగాణ పాలన

పేదల సంక్షేమం లక్ష్యంగా నిర్ణయాలు

రాజ్యాంగం ఎవరి పాత్ర ఏమిటో తెలియచేసింది

మీడియాతో స్పీకర్ పోచారం, మండలి చైర్మన్ గుత్తా



**హైదరాబాద్, జనవరి 26 (సమ సమాజం):** గణతంత్ర దినోత్సవ వేడుకలను శాసనసభలో ఘనంగా నిర్వహించారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మండలి ఆవరణలో, స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అసెంబ్లీ ఆవరణలో జాతీయ జెండా ఎగురవేశారు. శాసనసభ ప్రాంగణంలోని మహాత్మా గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు నివాళు లర్పించారు. అనంతరం మండలి 3వ

## బడ్జెట్ హల్వాను పంచిన నిర్మలా సీతారామన్



**న్యూఢిల్లీ, జనవరి 26 (సమ సమాజం):** బడ్జెట్‌కు ముందు ఏటా నిర్వహించే హల్వా వేడుకను ఆర్థిక శాఖ కార్యాలయంలో నిర్వహించారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ రూపకల్పనలో పాలుపంచుకున్న వారందరికీ హల్వా పంచిపెట్టారు. బడ్జెట్ తయారీ చివరి దశలో హల్వా వేడుక నిర్వహించడం స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి సంప్రదాయంగా వస్తోంది. ఫైనాన్స్ మినిస్టీ కార్యాలయ ఆవరణలో జరిగిన హల్వా వేడుకలో ఆర్థిక మంత్రితో పాటు ఆ శాఖ సహాయ మంత్రి భగవత్ కిషన్ రావ్, ఫైనాన్స్ మినిస్ట్రీకి చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రగతిభవన్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు



### జెండా ఆవిష్కరించిన సిఎం కెసిఆర్



**హైదరాబాద్, జనవరి 26 (సమ సమాజం):** 74వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సీఎం కేసీఆర్ ప్రగతి భవన్‌లో జాతీయ పతాకావిష్కరణ చేశారు. జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. సమాఖ్యగా వర్ధిల్లుతున్న భారత దేశంలో ఫెడరల్ స్ఫూర్తి పరిఢవిల్లుతూ, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం మూలస్తంభాలుగా పాలన సాగినప్పుడు మాత్రమే దేశంలో సంక్షేమం విలసిల్లి, మరింత ప్రగతి పథంలో పయనిస్తుందని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అన్నారు. విభిన్న పూలతో కూడిన పుష్పగుచ్ఛం మాదిరి విభిన్న సామాజిక, సంస్కృతులు, సంప్రదాయాలు, భాషలు, ఆచారాలతో భిన్నత్వంలో ఏకత్వాన్ని పొదిగిఉండటమే భారతదేశ ప్రధాన లక్షణమని పేర్కొన్నారు. భారతదేశాన్ని సర్వసత్తాక,సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా ప్రకటించుకొంటూ మనకు మనం సగర్వంగా సమర్పించుకొన్న పవిత్ర రాజ్యాంగాన్ని ప్రతీ పౌరుడు క్షుణ్ణంగా అవగాహన చేసుకొని, ఆ ఆశయాలను సాధించేందుకు మరింతగా కృషి చేయాలని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. 3వ

## ప్రగతిభవన్, రాజ్‌భవన్‌కు పరిమితమైన గణతంత్రం



విభేదాలకు రిపబ్లిక్ డే వేడుకలు వాడుకుంటే ఎలా

వేడుకలు నిర్వహించాలని హైకోర్టు చెప్పాలా

గవర్నర్‌కు వెంటనే కెసిఆర్ క్షమాపణలు చెప్పాలి

గాంధీభవన్ రిపబ్లిక్ వేడుకల్లో రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జనవరి 26 (సమ సమాజం):** రిపబ్లిక్ డే వేడుకలు ప్రగతి భవన్‌కు, రాజ్‌భవన్‌కు పరిమితం చేయడం ద్వారా కేసీఆర్ రాజ్యాంగాన్ని అవమానించారని పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. గవర్నర్, సీఎం మధ్య విభేదాలు ఉంటే మరో వేదికపై ప్రదర్శించాలి కానీ ఇలా గణతంత్రవేడుకలపై చూపితే ఎలా అన్నారు. ఇద్దరి మధ్య విభేదాలకు గణతంత్ర దినోత్సవాన్ని వేదికగా మార్చుకోవడం మంచిది కాదన్నారు. కేసీఆర్ వ్యవహార శైలిని మార్చుకోవాలి. వెంటనే సీఎం కేసీఆర్.. గవర్నర్‌కు క్షమాపణ చెప్పాలి. కోర్టు జోక్యం చేసుకుని రిపబ్లిక్ డే వేడుకలు జరపాలని ఆదేశించే పరిస్థితి వచ్చిందన్నారు. 74వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా 3వ

## భవనాలు, ఫామ్‌హౌజ్‌ల నిర్మాణమే అభివృద్ధి కాదు

తనంటే కొందరికి గిట్టక పోవచ్చు..

తెలంగాణతో నాబంధం ముడివడి ఉంది

పతాకావిష్కరణలో గవర్నర్ తమిళిసై పరోక్ష విమర్శలు

రాజ్యాంగ ఉల్లంఘనలపై కేంద్రానికి నివేదిక

పాండిచ్చేరిలో గవర్నర్ తమిళిసై కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్, జనవరి 26 (సమ సమాజం):** రాజ్ భవన్‌లో రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. రిపబ్లిక్ డే సందర్భంగా గవర్నర్ తమిళ సై జాతీయ పతాకావిష్కరణ చేశారు. ప్రభుత్వం తరుపున సీఎస్ శాంతి కుమారి, డిజిపి అంజనీకుమార్ పలువురు ఉన్నతాధికారులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌పై గవర్నర్ పరోక్ష విమర్శలు చేశారు. ప్రభుత్వ పని తీరుపై తీవ్ర స్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేశారు. కొత్త భవనాల నిర్మాణం అభివృద్ధి కాదు– నేషనల్ బిల్డింగ్ అభివృద్ధి అన్నారు. ఫామ్ హౌస్‌లు కట్టడం అభివృద్ధి కాదు. మన పిల్లలు విదేశాల్లో చదవడం కాదు– రాష్ట్ర విద్యాలయాలలో అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు ఉండాలన్నారు. తెలంగాణ గౌరవాన్ని నిలపెడుతాం – రాజ్యాంగాన్ని కాపాడుకుందాం. తెలంగాణతో నాకున్న బంధం మూడేళ్లు కాదు.. పుట్టుకతో ఉందన్నారు. కొంతమందికి నేను నచ్చక పోవచ్చు.. కానీ నాకు తెలంగాణ ప్రజలంటే ఇష్టం. నా తెలంగాణ కోటి రత్నాల వీణ' అని గవర్నర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గోల్డెన్ గ్లోబ్స్ అవార్డు గెలుచుకున్న, ఆస్కార్‌లకు నామినేట్ అయిన 'నాటు నాటు' పాట స్వరకర్త / గీత రచయిత ఎంఎం కీరవాణి, చంద్రబోస్‌లను గవర్నర్ తమిళిసై సత్కరించారు. ఈ వేడుకల్లో సీఎస్ శాంతికుమారి, డీజీపీ



3వ

# సంపాదకీయం

## రాజ్యాంగ విలువలకు పెద్దపీట వేయాలి !

ఏటా వైభవంగా గణతంత్ర వేడుకలను నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. రాజ్యాంగాన్ని గౌరవించుకోవడం మన విధి కనుక గణతంత్ర దినోత్సవాలను జరుపుకుంటున్నాం. కానీ రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేలా తెలంగాణ సిఎం కెసిఆర్ గణతంత్ర వేడుకలను కరోనా బూచి చూపి రాజ్‌భవన్‌కే పరిమితం చేయడం..హైకోర్టు మొట్టి కాయలు వేయడం చూశాం. గవర్నర్‌తో విభేదాలు వేరు..గణతంత్ర వేడుకలు వేరు అన్న విషయం మరచి కెసిఆర్ ప్రవర్తించారు. తమిళనాడులో, బెంగాల్లో గవర్నర్లతో ఆయా రాష్ట్రాల సిఎంలు విభేదిస్తూనే ఉన్నారు. అయినా గణతంత్ర వేడుకలను నిర్లక్ష్యం చేయలేదు. ఇది రాజ్యంగం ప్రకారం జరగాల్సిన కార్యక్రమం. గణతంత్ర వేడుకలను పద్దతి ప్రకారం జరపకపోవడం రకంగా రాజ్యాంగ ఉల్లంఘన కిందకు వస్తుంది. ఎపిలో జగన్ కూడా గవర్నర్‌తో సఖ్యంగానే ఉంటున్నారు. ఎట్ హోమ్ కార్యక్రమాలకు హాజరవుతున్నారు. కెసిఆర్ గవర్నర్‌తో వ్యతిరేకతను ఇలా చూపడం ద్వారా తన సంకుచిత రాజకీయాలను బయటపెట్టుకున్నారు. గవర్నర్ వ్యవస్థను వ్యతిరేకించే వారు..సిఎంలుగా ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. ప్రజలకు అందుబాటులో ఉండాలి. కానీ తెలంగాణలో అలా జరగడం లేదు. ప్రగతిభవన్ ముట్టడిస్తున్నా పట్టించుకోరు. ప్రజలను కలవరు. విపక్షాలు లేవనెత్తే అంశాలను సిఎంలు పట్టించుకుని..అందులో నిజం ఉందా లేదా అన్నది గ్రహించాలి. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటుంటే.. పాలకులు అధికారం కోరుకుంటున్నారు. ఎంతకు తెగించి అయినా అధికారంలోకి రావడమే లక్ష్యంగా అనేకానేక ఉచిత పథకాల హామీలను గుప్పిస్తున్నారు. నిజానికి ప్రజలకు ఏమి అవసరమో గుర్తించాలి. టీచర్లు ధర్నాలు చేస్తున్నా పట్టించుకోకుండా ఉండడం న్యాయమా అన్నది ఆలోచన చేయడం లేదు. విద్యుత్ సర్‌చార్జీలతో సామాన్యులు భారం మోస్తున్నారు. అయినా పట్టింపు లేదు. ఆదాయ వ్యయాలను పరిగణనలోకి తీసుకోకుండా చేస్తున్న పథక విన్యాసాలతో దేశ,రాష్ట్రాల ఆర్థిక ముఖచిత్రం మారిపోతోంది. అభివృద్ధి పడకేస్తోంది. నిరుద్యోగం పెరుగుతోంది. వస్తూత్పత్తి పడిపోతోంది. నిరంతరంగా ఏదో ఒక పథకం పేరుతో నగదు బదిలీలు జరుగుతున్నాయి. దీనికి కాంగ్రెస్, బిజెపిలతో పాటు ప్రాంతీయ పార్టీలన్నీ బరి తెగిస్తున్నాయి. పేదరికం నుంచి ప్రజలను బయటపడేసే ఉద్దేశ్యంతో చేస్తున్న ఆర్భాటాలతో పథకాలన్నీ బూడిదలో పోసిన పన్నీరు అవుతున్నాయి. నగదు బదిలీ పథకాలతో బొక్కసం గుల్ల చేస్తున్నారు. కొత్తగా ఉద్యోగాలు ఇవ్వగలిగే స్థితిలో ప్రభుత్వాలు ఉండడం లేదు. అమెరికాలో ఆర్థిక మాంద్యం లాగే మన వద్దా రాకుండా చూసుకోవాలి. ఉపాధి, ఉద్యోగరంగాలను బలోపేతం చేసే చర్యలు చేపట్టాలి. అలాగే ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరుగుతున్నందున అందుకు అనుగుణంగా వ్యవసాయాధారిత పరిశ్రమలతో స్వయం ఉపాధికి పెద్దపీట వేసే చర్యలు చేపట్టాలి. అయితే ఉన్న పరిశ్రమాలను మూసేస్తున్నారు. లాభాల బాటలో ఉన్న సంస్థలను తెగనమ్మేస్తున్నారు. దేశంలో ప్రజలు అన్నమో రామచంద్రా అంటున్నా పట్టించుకోవడం లేదు. రైతుబంధు, ఉచిత విద్యుత్, ఉపాధిహామీ, కిలోరూపాయి బియ్యంలాంటి పథకాలన్నీ దండగమారివే అయినా కొనసాగిస్తున్నారు. 74వ గణతంత్ర వేడుకలు జరుపుకుంటున్న వేళ పాలకులు ఆత్మపరిశీలన చేసుకోవాలి. తాము అధికారం లోకి వస్తే ఉచిత పథకాలతో లబ్దిచేకూరుస్తామని రాజకీయ పార్టీలు, నేతలు, ఎన్నికల వేళ చేస్తున్న వాగ్దానాల పట్ల గతేడాది సుప్రీం కోర్టు కన్నెర్ర చేసింది. ఉచిత వాగ్దానాలు సాధారణ బడ్జెట్‌ను మించి ఉంటున్నాయని, ఇలాంటి జనాకర్షక హామీలు గుప్పించడం తీవ్రమైన అంశమని పేర్కొంది. ఇకనుంచైనా ఉచిత వాగ్దానాల వర్షం కురిపించే రాజకీయ పక్షాలను, నేతలను నియంత్రించాల్సిన అవసరం ఉంది. ఎన్నికలకు ముందు ప్రజానిధులుఉచిత తాయిలాలు పంచిపెడుతూ, ఉచిత హామీలిస్తున్న పార్టీల

నైజాన్ని ప్రజలు కూడా గుర్తించాలి. ఎందుకు ఉచితంగా తమకు పథకాలను ఇస్తున్నారో గుర్తించకపోతే విద్యుత్ ఛార్జీలు పెంచుతారు. ఆర్టీసీ ఛార్జీలు పెంచుతారు. ఇలా అన్నీ పెంచి మోయలేని భారాన్ని మోపుతారు. ఉచిత హామీల బడ్జెట్ సాధారణ బడ్జెట్‌ను మించిపోతోంది. ఏడాపెడా అప్పులు చేస్తున్నారు. ఉద్యోగుల జీతాలకు కటకటగా ఉంటోంది. ఎపిలో అయితే బటన్ నొక్కడమే అభివృద్ధి అని జగన్ ప్రచారం చేసుకుంటు న్నారు. జనాకర్షణ విధానాలు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని, దీనిపై నిషేధం విధించాల్సి ఉంటుందని ఇప్పటికే సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఇది చాలా తీవ్రమైన సమస్య. అధికారం కోసం... అధికార వనరుల పై పెత్తనం కోసం చేస్తున్న విన్యాసాలే ఈ ఉచిత పథకాలు గా చెప్పుకోవాలి. ఎపిలో నిరంతరాయంగగా డబ్బుల పంపిణీ కార్యక్రమం మనకు కళ్లకు కనపడుతోంది. జగన్ ఎపిలో బొక్కసం ఖాళీ చేసేసారు. దళిబంధు పేరుతో తెలంగాణలో చేసే విన్యాసం కూడా అలాంటిదే. అధికారంలోకి రావడానికి పథకాలు ప్రకటించడం.. అధికారంలోకి వచ్చాక దానిని నిలుపుకోవడానికి నగదు బదిలీ పథకాలు ప్రవేశ పెట్టడం ఈ పదేళ్లుగా బాగా అలవాటు చేసుకున్నారు. ప్రజలు చెమటోడ్చి పన్నులు కడితే అభివృద్ధి పనులతో సంపదను సృష్టించాల్సిన నేతలు సంపదనలు హారతి కర్పూరంలా హరించి వేస్తున్నారు. మోడీతో సహా కెసిఆర్, జగన్, మమతా బెనర్జీ, కేజ్రీవాల్ లాంటి సిఎంలంతా ఇందుకు అతీతులు కాదు. ఏదో విధంగా అధికారాన్ని కాపాడుకోవాలన్న లక్ష్యంతో చేస్తున్న పథకాల కారణంగా ప్రజలు నష్టపోతున్నారు. రాజ్యాంగా విలువలను తుంగలో తొక్కుతున్నారు. ప్రజలను బికారులుగా చేస్తున్నారు. రాజ్యాంగవేత్తలు సూచించిన మార్గాల్లో నడుస్తూ ముందుకు సాగాల్సి ఉంది. వ్యక్తిగత ఎజెండాలతో దేశాన్ని సంక్షోభంలోకి నెట్టరాదు. ప్రజలు, మేధావులు మేల్కోవాలి. లేకుంటే దేశం అప్పుల ఊబిలో కూరుకుని పోగలదు. రాజకీయ నాయకుల అధికారం కోసం మనం బలి కావద్దన్న చైతన్యం రావాలి. రాజ్యాంగాన్ని కాపాడుకుంటూనే అందులోనుంచి బయటపడకుండా రాజకీయ నేతలు ముందుకు సాగాల్సి ఉంటుంది.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# దుబారా పథకాలకు కళ్లెం వేసేదెవరు

**ఉచిత పథకాలతో అప్పులకుప్పగా రాష్ట్రాలు ■ అప్పులు పెరుగుతున్నా పట్టించుకోని పాలకులు**

**హైదరాబాద్, జనవరి 26 (సమ సమాజం):** ప్రత్యేక తెలంగాణ ఏర్పడక ముందు నీళు ..నిధులు..నియామకాలు అంటూ ఊదరగొట్టిన కెసిఆర్ ఇప్పుడు తెలంగాణలో ఈ మూడు లక్ష్యాలు నెరవేరాయన్న ధోరణిలో ఉన్నారు. తెలంగాణ అంతా బంగారుమయం అయ్యిందన్న భావనలో ఉన్నారు. మనం అడక్కుండానే కాళేశ్వరం కట్టి అది ప్రజలకోసమే అన్నారు. అలాగే ఉచిత విద్యుత్ దుబారాను అరికట్టడం లేదు. అప్పులు, వడ్డీల సంగతి సరేసరి. దాంతో ఇతర పథకాలకు, అభివృద్ధి కార్యక్రమాలకు డబ్బులకు కటకట ఏర్పడుతోంది. దీనికితోడు నిరుద్యోగ సమస్య వెన్నాడుతోంది. కిలో రూపాయి బియ్యం పథకం, రైతుబంధు తదితర పథకాలను తక్షణం సమీక్షించాల్సిన సమయం ఆసన్నమైంది. లేకుంటే మరింత ఆర్థిక బారం తప్పేలా లేదు. రైతుబంధు ముసుగులో వేలకోట్ల దుర్వినియోగాన్ని ఆపడం లేదు. రూపాయికే కిలో బియ్యం పథకంతో దుబారాను అరికట్టడం లేదు. రైతులు గిట్టుబాటు ధరలు కావాలన్నా..ధాన్యం కొనుగోళ్లు చేయాలన్నా సవాలక్ష కొర్రీలు పెడుతున్నారు. అంటే పథకాలన్నీ ఓట్లను రాల్చేలా ప్రవేశ పెట్టడం నేర్చుకున్నారు. ధనిక రాష్ట్రం కాస్తా ఇప్పుడు అప్పుల ఊబిలో మునగడానికి సిద్ధంగా ఉంది. ఉచిత పథకాలతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతున్నా పాలకులు మేల్కోవడం లేదు. ఇక్కడ కెసిఆర్, ఎపిలో జగన్ చేతికి ఎముక లేదన్న చందంగా అటుఇటుగా ఒకే తరహా పథకాలతో ప్రజల్లో దానకర్ణుడిలా పోజులు పెడుతు న్నారు. ప్రత్యేక విమానాల్లో విహరించడం మొదలు అధికారం కోసం ప్రజల డబ్బును నీళ్ల ప్రాయంగగా ఖర్చు చేస్తున్నారు. ఎన్నికల్లో లబ్ది కోసమే దళితబంధు పథకాన్ని ప్రారంభించామని ఇటీవల సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు చూసిన తరవాత కూడా ప్రజలు గ్రహించడం లేదు. దళితబంధు మాత్రమే కాదు.. రైతుబంధు, 24 గంటల ఉచిత విద్యుత్తు, కల్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్లు, పంటరుణాల మాఫీ, రైతుబీమా.. కిలో రూపాయికే బియ్యం వంటివన్నీ ఉచిత పథకాలే. ఎన్నికల సందర్భాల్లోనో, ఇతర రాజకీయ పరిస్థితుల్లోనో ప్రజలను ఆకర్శించేందుకు కేసీఆర్ ఇచ్చిన హామీల మేరకు అమలు చేస్తున్నవే. వీటిలో అనుత్పాదక ఉచిత పథకాలతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతోంది. ఇప్పటికే రాష్ట్ర అప్పులు దాదాపుగా మూడు లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఉచిత పథకాల నిధుల భారంతో భారం తడిసి మోపెడు అవుతోంది. కేసీఆర్,జగన్ అందచేస్తున్న నగదు బదిలీలు అంతాఇంతా కాదు. ఎన్నికల్లో గెలవడమే లక్ష్యంగా వేల కోట్ల రూపాయలతో కొత్త కొత్త పథకాలు తెరమీదకు తెస్తోంది. కేసీఆర్ రాక ముందు కూడా రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాలు ఉన్నాయి. వాటికి కేసీఆర్ జోడించిన కొత్త పథకాల బరువు ఏటా రూ.45 వేల కోట్ల పైమాటేనని లెక్కలు చెబుతున్నాయి.. రైతులకు పెట్టుబడి సాయం చేయాలన్న ఉద్దేశంతో 'రైతుబంధు' పథకాన్ని ప్రవేశపెట్టారు. ఎకరానికి రూ.10 వేలు ఇస్తున్నారు. ఏడాదికి రూ.14 వేల కోట్లకు పైగానే ఖర్చవుతోంది. దీనికి ఎలాంటి పరిమితులు లేవు. వందల ఎకరాలున్నా ఆర్థిక సాయానికి అర్హు లే. పరిమితి విధించాలంటూ చాలాకాలం నుంచి డిమాండ్లు ఉన్నా పట్టించుకోవడం లేదు. మంత్రి మల్లారెడ్డి కూడా తనకు 600 ఎకరాలున్నాయంటూ ప్రకటించారు. ఇలాంటి మోతుబరికి ఇవ్వడం అవసరమా? అన్న ప్రశ్నలున్నాయి. అయినా ప్రభుత్వం వెనక్కి తగ్గడం లేదు. రైతుబంధును ఎలాగైనా ముందుకు నడిపించే పట్టుదలలో వ్యవసాయ రంగానికి సంబంధించిన ఇతర సబ్సిడీ పథకాలను కొండెక్కించి, రైతు బంధుకు మళ్లిస్తోంది. రైతులకు రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.5,225 కోట్లను ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటివరకు రూ.37 వేల లోపు అప్పు ఉన్న లక్ష మంది రైతులకు మాఫీ చేసింది. చెప్పిన అందరికీ చేయాలంటే ఇంకా రూ.5000 కోట్లు కావాలి. రైతు బీమాకు రూ.1200 కోట్లను ఖర్చు పెట్టారు. రైతులకు 24 గంటల పాటు ఉచిత విద్యుత్తుకు ఏడాదికి రూ.12 వేల కోట్లను వెచ్చించాల్సి వస్తోంది. ఉచిత విద్యుత్ గతంలోనూ ఉన్నా 24 గంటల విద్యుత్ అందుతోంది కేసీఆర్ హయాంలోనే. దాంతో ఉచిత విద్యుత్ భారం ప్రభుత్వంపై పలు రెట్లు పెరిగింది. 10 బోర్లు ఉన్న పెద్ద రైతులకు కూడా ఉచిత విద్యుత్తు అందించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్న ఉదయి స్తోంది. పేద యువతుల పెళ్లిళ్ల కోసం కల్యాణలక్ష్మి కింద ఏటా 3 వేల కోట్లు ఖర్చు పెడుతున్నారు. కేసీఆర్ కిట్లకు రూ.1100 కోట్లు, ఆసరా పెన్షన్లకు 12 వేల కోట్లు ఖర్చవుతోంది. కేసీఆర్ సొంత పథకాల విలువే రూ.45 వేల కోట్లు దాటుతోంది. రేషన్ బియ్యం సబ్సిడీకి కూడా ప్రభుత్వం ఏటా వందల కోట్లు ఖర్చు చేస్తోంది. హుజూరాబాద్ ఎన్నికలకు ముందు ప్రకటించిన దళితబంధు మరో ఉచిత నగదు పంపిణీ పథకం గా చూడాలి. ఒక్కో దళిత కుటుంబానికి రూ.10 లక్షల నగదును పంపిణీ చేస్తామని చెప్పారు. హుజూరాబాద్‌లో రూ.2000 కోట్లను పంపిణీ చేశారు. రాష్ట్రమంతటా అడిగిన వారికి కాదనకుండా అమలు చేస్తామన్నారు. అలా ఇవ్వాలంటే రూ.1.70 లక్షల కోట్లు అవసరమవు తాయని అంచనా వేస్తున్నారు. ఎస్సీల మాదిరిగానే ఎస్టీలు, బీసీలు, ఈబీసీలు, మైనారిటీలకూ అమలు చేస్తామని కేసీఆర్ ప్రకటించారు. కార్యరూపం దాల్చితే రాష్ట్ర ప్రభుత్వం అప్పుల బాట పట్టాల్సిందే.

# రాష్ట్రంలో ఘనంగా గణతంత్ర వేడుకలు

**మినిస్టర్ క్వార్టర్స్‌లో జెండా ఆవిష్కరించిన కొప్పుల**



**హైదరాబాద్, జనవరి 26 (సమ సమాజం):** గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర మంత్రులు , ఎమ్మెల్యేలు పలు జిల్లాలో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. హైదరాబాద్ లోని మినిస్టర్ క్వార్టర్స్ లోని తమ కార్యాలయంలో గురువారం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.కరీంనగర్ జిల్లా తీగలగుట్టపల్లి లోని తెలంగాణ భవన్‌లో బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ జెండాను ఎగురవేసి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. నగర మేయర్ యాదగిరి సునీల్ రావు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కనుమళ్ల విజయ గారు, చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవి శంకర్, బీఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్లా హరి శంకర్ గారు, సుడా చైర్మన్ జివి కృష్ణారావు గారు, గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ గారు, మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేని మధు గారు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మన్ రావు, అరేపల్లి మోహన్ , కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు. రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. పెద్దపల్లి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. మహాత్ముల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎంపీడీవో ఎం.రాజు, ఎంపీపీ బండారి స్రవంతి శ్రీనివాస్ గౌడ్ , అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా కెసిఆర్ పాలన

**మండిపడ్డ ఎమ్మెల్యేరఘునందన్ రావు**



**హైదరాబాద్, జనవరి26(ఆర్ఎన్ఎ):** గణతంత్ర దినోత్సవం రోజున కూడా రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు పరిపాలన చేయడం బాధాకరమని ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. గవర్నర్‌ను, బీజేపీని వ్యతిరేకిస్తున్నామనుకునే మీ నిర్ణయాల వల్ల జాతీయ జెండాకు అవమానం జరుగుతోందని మండిపడ్డారు. గవర్నర్ జాతీయ జెండాను ఎగువేస్తేనే కరోనా ప్రభలుతుందనుకోవడం ఓర్వలేని గుణం మాత్రమేనని ఆరోపించారు. సర్వోన్నత న్యాయ స్థానం పెరేడ్ గ్రౌండ్ లో జెండా వేడుకలు నిర్వహించిలనే మాటను సీఎం కేసీఆర్ తుంగలో తొక్కడం బాధాకరమన్నారు. జిల్లాలల్లో జెండా కార్యక్రమాలను రద్దు చేయుమని చెప్పడంలో ఆంతర్యం ఏంటన్నారు. హైదరాబాద్‌లో గవర్నర్‌తో జెండా వేడుకలు జరపవద్దనే జిల్లాల్లో కూడా రద్దు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో ఇంతగా రాజకీయాలను దిగజార్చడం బాధాకరం.. ఈ అవమానం జాతీయ జెండాకు చేసినట్టే అని అన్నారు. ఖమ్మంలో బహిరంగ సభ పెడితే కరోనా పాండమిక్ ఉండదా? రేపు మీ పుట్టిన రోజు సందర్భంగా సచివాలయం ప్రారంభిస్తామనుకుంటే కరోనా ప్రబలదా? సచివాలయం ప్రారంభోత్సవ సందర్భంగా నిర్వహించబోయే సభలో కరోనా ప్రబలదా? అంటూ ఎమ్మెల్యే రఘునందన్ రావు నిలదీశారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని ముఖ్యమంత్రి కి హెచ్చరించారు. గణతంత్ర దినోత్సవం రోజున రాజకీయం చేయడం తగదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి మనసు మార్చుకుని రాజకీయాలను దిగజార్చకుండా ఉండండాలని కోరారు.

# మరోమారు వేర్పాటు అంటే నేనేంటో చూపిస్తా

**విభజన వాదుల నా సత్తా ఏంటో చూపుతా**

**ఇప్పటికే మీరు చేసిన విభజన రాజకీయాలు చాలు**

**వేర్పాటువాద ధోరణితో మాట్లాడితే నాలాంటి తీవ్రవాదిని చూడరు**

**గణతంత్ర వేడుకల్లో ఘాటుగా హెచ్చరించిన జనసేనాని**




**గుంటూరు, జనవరి 26 (సమ సమాజం):** వేర్పాటువాద ధోరణితో రాష్ట్రాన్ని, ప్రజల్ని విడగొట్టింది చాలు.. ఇక ఆపేయండి' అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక రాష్ట్రాలు కావాలంటూ ఇటీవల కొందరు నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై ఈ సందర్భంగా పవన్ నిప్పులు చెరిగారు. రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రిపబ్లిక్ డే రోజున చెప్తున్నా.. ఏపీకి చెందిన నేతలు వేర్పాటువాద ధోరణితో మాట్లాడితే నాలాంటి తీవ్రవాదిని ఇంకోసారి చూడరు. విసిగిపోయాం.. మీ బతుకులకేం తెలుసు? కాన్‌స్టిట్యూషన్ అసెంబ్లీ డిబేట్స్ చదివారా? అవినీతిలో మునిగిపోయిన.. పబ్లిక్ పాలసీ తెలియని మీరు రాష్ట్రాన్ని విడగొట్టేస్తారా? మేం చూస్తూ కూర్చొంటామా? మేం దేశ భక్తులం.. ఆంధ్రప్రదేశ్‌ను ఇంకోసారి విడగొడతామంటే తోలుతీసి కింద కూర్చోబెడతాం. తమాషాగా ఉందా..ఎంతమంది సీఎంలు రాయలసీమ నుంచి వచ్చారు? ఆ ప్రాంతానికేం చేశారు?అక్కడ నుంచి వలసలు ఎందుకు ఆపలేకపోయారు?ఉత్తరాంధ్ర రాష్ట్రం కావాలా? వైజాగ్ స్టీల్‌ప్లాంట్ కోసం తెలంగాణకు చెందిన జగిత్యాలలో సాయిరెడ్డి చనిపోయారు.. గుంటూరులో హబీబుల్లా మస్తాన్ మరణించారు. ఆ సంగతి మీకు తెలుసా? మీ స్వార్థం కోసం ఇష్టారాజ్యంగా స్టేట్‌మెంట్లు ఇవ్వొద్దు. చాలు.. రాష్ట్రాన్ని ప్రజల్ని విడగొట్టింది చాలు.. ఇక ఆపేయండి' అని పవన్ వ్యాఖ్యానించారు. వేర్పాటువాద ధోరణితో ఎవరైనా మాట్లాడితే తనలాంటి తీవ్రవాదిని ఇంకోసారి చూడరని పవన్ హెచ్చరించారు. ప్రజల కోసమే జనసేన కార్యాలయమన్న పవన్.. జనానికి ఏ సమస్య వచ్చినా పార్టీ ఆఫీస్‌కు రావచ్చని అన్నారు. పార్టీలతో పొత్తులపై పరోక్షంగా స్పందించిన పవన్... ప్రజల అవసరాలకు అనుగుణంగా తాను మారుతానని, తన విధానాలను మార్చుకుంటానని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో తాజా రాజకీయాలపై రిపబ్లిక్ డే ప్రసంగంపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు . ముఖ్యంగా కోడికత్తి రాజకీయాలతో సీఎం కానని.. జనం కోరుకుంటేనే అవుతానని జనసేనాని వెల్లడించారు. విడగొట్టే వాళ్ల మాటలు నమ్మకండి దేశ సమగ్రతకు భంగంకలిగించి.. మతాల మధ్య చిచ్చుపెడితే ఊరుకోమంటూ వార్నింగ్ ఇచ్చారు. తన వారాహి వాహనంపై జరుగుతున్న రచ్చతో పాటు వైసీపీ ప్రభుత్వ పాలనపై పవన్ విమర్శలతో విరుచుకుపడ్డారు. రోడ్డు మీదకు వస్తానంటే మిమ్మల్ని ఆపేస్తాం, తోసేస్తాం, కింద పడేస్తాం.. జీవో నంబర్ 1 వ్యవహారాన్ని కూడా ప్రస్తావిస్తూ పవన్ సెటైర్లు సంధించారు. అలాగే మీ వారాహి మా ఏపీ రోడ్లపై ఎలా తిరుగుతుందో మేమూ చూస్తామని కూడా అంటున్నారని పవన్ ప్రస్తావించారు. తానెలా ఆలోచిస్తానంటే వింటానని, మాట్లాడనని, ఈ రంగు కాదు, ఆ రంగు కాదని ఒక్కొక్కరూ పేట్రేగిపోయారంటూ వైసీపీ మంత్రులు, నేతల్ని ఉద్దేశించి విమర్శించారు. అయితే, తాను మర్డర్లు, కోడి కత్తులతో పొడిపించుకోవడం వంటి పనులు చేయనని జనసేనాని ఎద్దేవ చేశారు. తాను చట్టాల్ని పాటించేవాడిని, వాటిని అతిక్రమించి వారాహిని ఎందుకు బయటికి తెస్తామని విమర్శలకు ధీటుగా సమాధానం చెప్పారు. తప్పుడు పనులు చేసి వేల కోట్లు దొబ్బేసి, వేల ఎకరాలు దోచేసుకుని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల్ని కూడా దుర్వినియోగం చేసిన మీకే ఇంత ధైర్యం ఉంటే.. ఏ తప్పూ చేయని మాకెంత ఉండాలంటూ ప్రశల వర్షం కురిపించారు. మీరు మాతో గొడవ పెట్టుకోండి.. అప్పుడు మేం ఏంటో చెప్తామంటూ సవాల్ విసిరారు.వారాహికి కాస్త మదమెక్కనీయండి.. అప్పుడు దండయాత్ర చేద్దామంటూ జనసేనాని కార్యకర్తలను సముదాయించే ప్రయత్నం చేశారు. బాబాయిని చంపి సీబీఐకి కేసు అప్పగించుకోవడం.. కోడి కత్తితో పొడిపించుకుని తెలంగాణ వైద్యులు దగ్గరకు వెళ్లడం.. ఏపీ పోలీసులుపై నమ్మకం, గౌరవం లేదన్న వ్యక్తి.. ఇప్పుడు సీఎంగా పోలీసులు అందరూ శాల్యూట్ చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఒక పోలీసునే జైలులో పెట్టి కొట్టిన వ్యక్తి అతను.. వైసీపీ ప్రజాప్రతినిధులు ఎవరికీ సమాధానం చెప్పనక్కరలేదని అనుకుంటున్నారని విమర్శించారు. వాళ్ల మెడలు వంచి సమాధానం చెప్పిస్తాం.. పోరాడితే పోయేదేమీ లేదు.. బానిస సంకెళ్లు తప్ప అంటూ మాటల తూటాలకు పదను పెట్టారు. జనసేన పక్షాన నిలబడిన వ్యక్తి ని రోడ్డు ప్రమాదంలో చంపేశారని.. రేపు ఎలాంటి ప్రభుత్వం వచ్చినా దివ్యాంగులకు పెన్షన్, అభివృద్ధికి తోడ్పాటు అందించే పథకాలు ఉంటాయని హామీ ఇచ్చారు. ఐదు వేల జీతం ఇచ్చే ఉద్యోగాలు ఇచ్చి గొప్పలు చెబుతారా అంటూ ప్రశ్నించారు. వాళ్ల నాన్న సీఎం.. అందుకే కోట్లు దోచుకున్నాడు.. తండ్రి శవాన్ని అడ్డం పెట్టుకుని సీఎం కోసం సంతకాలు చేయించాడు అంటూ సీఎం జగన్‌పై సూటిగా మాటల దాడి చేశారు జనసేనాని. ఇటువంటి వ్యక్తి ని నమ్మి ఓటు వేస్తే వారినీ మోసం చేశాడు.. నాతో సహా ఎవరికీ వ్యక్తిగత ఆరాధన గుడ్డిగా చేయకండని హితవు పలికారు.

# గణతంత్ర వేడుకలను నిర్వహించని కెసిఆర్

**సిఎంగా కొనసాగే హక్కు లేదు: జీవన్ రెడ్డి**



**జగిత్యాల, జనవరి 26 (సమ సమాజం):** రిపబ్లిక్ డే వేడుకలను అధికారికంగా నిర్వహించని సీఎం కేసీఆర్ పై ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఫైర్ అయ్యారు. ఆయనకు ముఖ్యమంత్రిగా కొనసాగే హక్కులేదని అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్ లో జాతీయ జెండా ఎగరేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గణతంత్ర దినోత్సవ వేడుకలు జరపాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. కీలక పదవిలో ఉన్న సీఎం కేసీఆర్ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనకపోవడం దారుణమని జీవన్ రెడ్డి మండిపడ్డారు. ఇది గవర్నర్ ను కాదు.. భారత రాజ్యాంగాన్ని అవమానపరచడమేనని అన్నారు. రాష్ట్ర ఏర్పాటుకు మూలమైన రాజ్యాంగానికి కేసీఆర్ ఇచ్చిన గౌరవం ఇదేనా అని జీవన్ రెడ్డి ప్రశ్నించారు.

# మాది తండ్రీ కూతుళ్ళ అనుబంధం

**శ్రావణి వ్యాఖ్యలు బాధించాయన్న సంజయ్**

**జగిత్యాల, జనవరి 26 (సమ సమాజం):** జగిత్యాల చైర్ పర్సన్ భోగ శ్రావణి వ్యాఖ్యలు బాధించాయని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. ఆమె మీడియా ముందు చేసిన వాఖ్యలపై ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్పందించారు. ఈ అంశంపై మీడియాతో మాట్లాడిన ఆయన.. శ్రావణి చేసిన ఆరోపణలు బాధ కలిగించాయని అన్నారు. తాము తండ్రీకూతుళ్లలా ఉండేవాళ్లమని, మంచి ఫ్యూచర్ ఉందని ఆమెకు ఎన్నోసార్లు చెప్పానని గుర్తు చేసుకున్నారు. గత కొన్ని నెలలుగా చైర్మన్పై కౌన్సిలర్లు అసంతృప్తితో ఉన్నావారికి సర్ది చెప్పామని, ఇటీవల కొందరు కౌన్సిలర్లు అవిశ్వాసం అంశం తీసుకువచ్చినా తోసిపుచ్చానని చెప్పారు. ఈ విషయాన్ని మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ రమణ, జిల్లా బీఆర్ఎస్ పార్టీ ప్రెసిడెంట్ ఎమ్మెల్యే విద్యా సాగర్ రావు దృష్టికి తీసుకువెళ్లానని గుర్తు చేశారు. త

# గవర్నర్ వ్యాఖ్యలపై మండిపడ్డ కవిత

**సెంట్రల్ విస్టాలాంటి నిర్మాణాలను వ్యతిరేకించామని వెల్లడి ● గవర్నర్ వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్దంగ అన్న తలసాని**



**హైదరాబాద్, జనవరి 26 (సమ సమాజం):** తెలంగాణ ప్రభుత్వం పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. ఈ మేరకు కవిత ట్వీట్ చేశారు. కరోనా లాంటి క్లిష్ట సమయంలో సెంట్రల్ విస్టా మీద కంటే , దేశ మౌలిక సదుపాయాల మీద దృష్టి పెట్టాలని బీఆర్ఎస్ పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిందని కవిత గుర్తు చేశారు. కేవలం కొందరి సంపద పెంపుపై మాత్రమే దృష్టి పెట్టకుండా, రైతులు, కూలీలు, నిరుద్యోగ యువతను పట్టించుకోవడం కోసమే మేము పోరాడుతున్నాము అని తెలిపారు. ఇలాంటి ప్రత్యేకమైన రోజున, సీఎం కేసీఆర్ ప్రశ్నిస్తున్న వాటినే మళ్లీ అడిగినందుకు గవర్నర్‌కు ధన్యవాదాలు అని కవిత తన ట్వీట్‌లో పేర్కొన్నారు. రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్‌పై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నిప్పులు చెరిగారు. గణతంత్ర దినోత్సవంలో రాజకీయాలు మాట్లాడటం తగదని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం పట్ల గవర్నర్ తమిళిసై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తలసాని శ్రీనివాస్ యాదవ్ తప్పుబట్టారు. రాజ్యాంగ స్ఫూర్తి దెబ్బతినేలా గవర్నర్ మాట్లాడారని తలసాని పేర్కొన్నారు. గవర్నర్ వైఖరిపై త్వరలోనే రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాస్తామని చెప్పారు. గవర్నర్ విషయంలో రాష్ట్రపతి కల్పించుకోవాలన్నారు. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉంటూ ఓ పార్టీ కి అనుకూలంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజును రాజకీయాలకు ఉపయోగించడం తగదు అని తలసాని శ్రీనివాస్ యాదవ్ ధ్వజమెత్తారు.

# భవనాలు, ఫామ్‌హౌజ్‌ల నిర్మాణమే అభివృద్ధి కాదు



(మొదటి పేజి తరువాయి) అంజనీకుమార్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గవర్నర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ రాజ్‌భవన్‌లోనూ గణతంత్ర దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఆ తర్వాత తెలుగులో ప్రసంగం ప్రారంభించిన గవర్నర్ తమిళిసై.. తెలంగాణ రాష్ట్రం ప్రజల గురించి, అభివృద్ధి గురించి మాట్లాడుతూనే పరోక్షంగా కేసీఆర్ ప్రభుత్వంపై కామెంట్స్ చేశారు. కొంతమందికి తాను నచ్చకపోవచ్చు.. అయినప్పటికీ తెలంగాణ అభివృద్ధికి కృషి చేస్తానంటూ గవర్నర్ వ్యాఖ్యానించారు. రాష్ట్రాభివృద్ధికి రాజ్‌భవన్ సహకారం అందిస్తోందని .. రాష్ట్ర అభివృద్ధిలో తన పాత్ర తప్పక ఉంటుందన్నారు. కొత్త భవనాలు నిర్మించడం మాత్రమే అభివృద్ధి కాదని.. తెలంగాణ గౌరవాన్ని నిలబెడదాం.. ప్రజాస్వామ్యాన్ని కాపాడదామంటూ గవర్నర్ తమిళిసై పిలుపునిచ్చారు.

# బాసరలో ఘనంగా వసంతపంచమి వేడుకలు

(మొదటి పేజి తరువాయి) దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పవిత్రమైన రోజున తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించడానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ నేపథ్యంలో ఆలయ పండితులు తెల్లవారుజామున 2 గంటలకు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 3 గంటల నుంచి అక్షరాభ్యాసాలు కొనసాగాయి. బాసర ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో సుందరీకరించారు. ఆలయ గోపురాలు, తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలతో ఆలయం మిరుమిట్లు గొలుపుతున్నది. పలువురు భక్తులు ముం దుగానే చేరుకొని ఆలయ ఆవరణలోనే నిద్రించారు. ఉదయం గోదావరిలో పుణ్య స్నానా లు ఆచరించి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజ లు నిర్వహించి మొక్కులు తీర్చుకుంటున్నారు. సకల జ్ఞానాలకు ఆదిదైవమైన సరస్వతీ దేవి అవతరించిన వసంతపంచమి సందర్భంగా దేవదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి దంపతులు రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అంతకుముందు ఆలయ పండితులు పూర్ణకుంభంతో మంత్రికి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం తీర్థ ప్రసాదాలు అందించి, ఆశీర్వచనం చేశారు. అనంతరం మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు వసంత పంచమి శు భాకాంక్షలు తెలిపారు. వసంత పంచమి వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక



ఏర్పాట్లు చేసిందన్నారు.బాసర దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని, భక్తులకు మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. వసంత పంచమి రోజు చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తే మంచి ఫలితాలు లభిస్తాయన్నారు. బాసర ఆలయ అభివృద్ధి కోసం రూ.50 కోట్లు కేటాయించామని వెల్లడించారు. భవిష్యత్తులో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే విఠల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ రిటైర్మెంట్ తీసుకోవాలి: విజయశాంతి

**హైదారాబాద్,జనవరి26(సమ సమాజం):** రాజ్యాంగానికి, గవర్నర్‌కు సీఎం కేసీఆర్ గౌరవం ఇవ్వడం లేదని బీజేపీ నేత, మాజీ ఎంపీ విజయశాంతి మండిపడ్డారు. కేసీఆర్ తొందరగా వీఆర్ఎస్ తీసుకోని వెళ్లిపోతే రాష్ట్రం బాగుపడుతుందని అన్నారు. ముఖ్యమంత్రికి మహిళలంటే చిన్నచూపన్న విజయశాంతి .. కేసీఆర్ పాలనలో మహిళలు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని చెప్పారు. కేసీఆర్ పని అయిపోయిందని, ఆయన రిటైర్మెంట్ తీసుకోవడం మంచిదని అన్నారు. బీజేపీలోకి చేరికలు మరింత పెరుగుతాయని విజయశాంతి చెప్పారు.

# టీచర్లకు గుడ్ న్యూస్

(మొదటి పేజి తరువాయి) ఆన్ లైన్ ఈ నెల 28 నుంచి 30 వరకు స్వీకరించనున్నట్టు పేర్కొన్నారు. కాగా ఈ నెల 27 నుంచి మార్చి 4వ తేదీ దాకా 37 రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుందని స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు ఇంతకు మునుపే ప్రకటించారు. దరఖాస్తుల హార్డ్ కాపీలను హైస్కూల్ టీచర్లు సంబంధిత హెడ్మాస్టర్లకు.. గవర్నమెంట్ ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్కూల్ టీచర్లు సంబంధిత ఎంఈఓలకు.. మండల పరిషత్ ప్రైమరీ, యూపీఎస్ టీచర్లు సంబంధిత కాంప్లెక్స్ హెడ్మాస్టర్లకు.. హైస్కూల్ హెడ్మాస్టర్లు డీఈఓలకు జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2 దాకా అందించాలి. ఫిబ్రవరి 3 నుంచి 6 దాకా అప్లికేషన్ల హార్డ్ కాపీలను సంబంధిత హెడ్మాస్టర్లు, ఎంఈఓలు డీఈఓ ఆఫీసులో సమర్పిస్తారు. వాటి పరిశీలన, ఆన్?లైన్‌లో ఆమోదం తదితర పక్రియలు జరుగుతాయి.9న డీఈఓ/ఆర్జేడీ వెబ్ సైట్లలో బదిలీ పాయింట్లతో ప్రొవిజనల్ సీనియారిటీ లిస్టులు, ప్రమోషన్ల సీనియారిటీ లిస్టులు ప్రకటిస్తారు. 10వ తేదీ వరకు మూడు రోజులు అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన చేసి.. సమస్యలు ఏమైనా ఉంటే పరిష్కరిస్తారు. 11,12 తేదీల్లో నైల్ సీనియారిటీ లిస్టు.. హెడ్మాస్టర్ల బదిలీలకు వెబ్‌ఆప్షన్ల నమోదు ఉంటుంది. 13న మల్టీజోనల్ స్థాయిలో హెడ్మాస్టర్ల వెబ్ ఆప్షన్ల ఎడిటింగ్, పునర్ పరిశీలన ఉంటుంది. 14న హెడ్మాస్టర్ల బదిలీ ఉత్తర్వులను ఆర్జేడీలు ఇస్తారు. 15న బదిలీల తర్వాత మిగిలిన ఖాళీల ప్రకటన. 6, 17, 18వ తేదీల్లో అర్హత గలిగిన స్కూల్ అసిస్టెంట్స్ కు ప్రభుత్వ, జిల్లా పరిషత్ మేనేజ్మెంట్ స్కూల్స్ హెడ్మాస్టర్ల ప్రమోషన్ల కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. 19, 20వ తేదీల్లో స్జబెక్టుల వారీగా స్కూల్ అసిస్టెంట్ల ఖాళీల ప్రకటన, బదిలీల ఆప్షన్స్ నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. 21న ఆప్షన్ల సవరణ, పునర్ పరిశీలనకు అవకాశం.,22, 23వ తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ల బదిలీల ఉత్తర్వులను డీఈఓలు ఇస్తారు,24న స్కూల్ అసిస్టెంట్స్ బదిలీల తర్వాత ఏర్పడిన ఖాళీల ప్రకటన. 25, 26, 27 తేదీల్లో ఎస్జీటీ తత్సమాన కేటగిరీ టీచర్లకు కోర్టు కేసులు లేని స్జబెక్టులకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్లు నిర్వహిస్తారు. 28, మార్చి1, 2 తేదీల్లో ఎస్జీటీ తత్సమాన పోస్టుల ఖాళీల ప్రకటన, వెబ్ ఆప్షన్స్ నమోదు ఉంటుంది. మార్చి3న ఆప్షన్ల సవరణ, పునర్ పరిశీలన. ఎస్జీటీ తత్సమాన కేటగిరీ టీచర్లకు బదిలీ ఆర్డర్లు ఉంటాయి. 19 వరకు డీఈఓ ఇచ్చిన బదిలీ ఉత్తర్వులపై అప్పీల్స్, అభ్యంతరాలను ఆర్జేడీకి, ఆర్జేడీ ఉత్తర్వులపై అప్పీల్స్/ అభ్యంతరాలను స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్‌కు పంపాలి. సంబంధిత అధికారులు 15 రోజుల్లో వాటిని

# ప్రగతిభవన్, రాజ్‌భవన్‌కు పరిమితమైన గణతంత్రం



(మొదటి పేజి తరువాయి) గాంధీభవన్‌లో జాతీయ జెండాను రేవంత్ రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. అంబేద్కర్ విగ్రహం కోసం కోట్లు ఖర్చు పెట్టినా ఇంతవరకు పూర్తి చేయలేదని విమర్శించారు. పార్టీ ఫిరాయింపుల చట్టం మరింత పక్కాగా ఉండాల్సిన అవసరం ఏర్పడిందని రేవంత్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయిస్తే వారి సభ్యత్వం రద్దు చేయడంతో పాటు అవసరమైతే ఉరి తీసే విధానాన్ని తీసుకు రావాల్సిన అవసరం ఉందని రేవంత్ అభిప్రాయపడ్డారు. హత్యలు, హత్యాచారాలకు అమలు చేసే కఠిన శిక్షలను పార్టీ ఫిరాయించిన వారికి వర్తింపజేయాలి. పార్టీ ఫిరాయింపుల పట్ల కఠిన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ అంశంపై రాజ్యాంగంలో సవరణ తీసుకురావాల్సిన విషయాన్ని మేధావులు ఆలోచించాలన్నారు. జనవరి 30న రాహుల్‌గాంధీ కశ్మీర్‌లో జాతీయ జెండా ఆవిష్కరించి దేశ సార్వభౌమత్వాన్ని చాటుతారు. ఆ రోజు అన్ని మతాల ప్రార్థనా మందిరాల్లో పూజలు చేయాలి. ఇవాళ హాత్ సే హాత్ జోడో యాత్ర లాంఛనంగా ప్రారంభించినా.. ఫిబ్రవరి 6 నుంచి 60 రోజులపాటు కొనసాగు తుందన్నారు. వీలైనన్ని ఎక్కువ నియోజకవర్గాలు తిరుగుతానని, తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించి ముందుకు తీసుకెళ్లాలని కోరుతానని అన్నారు. రిజర్వేషన్లను పేదలకు దూరం చేసే కుట్ర జరుగుతోందని,. ఈ కుట్రను తిప్పికొట్టాల్సిన బాధ్యత మనపై ఉంది. తొమ్మిది ప్రభుత్వాలను కూలదోసి బీజేపీ రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిందని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు.

# కర్తవ్యపథ్‌లో ఘనంగా గణంతంత్ర వేడుకలు

(మొదటి పేజి తరువాయి) వేడుకల్లో ఈసారి సామాన్యులకు పెద్దపీట వేశారు. రిక్షాకార్మికులు, చిరువ్యాపారులకు పరేడ్ చూసేందుకు అవకాశం కల్పించారు. దేశవ్యాప్తంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో మొదటిసారి నిర్వహించిన ఆర్మీ కవాతులో త్రివిధ దళాల కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈసారి గణతంత్ర దినోత్సవ పరేడ్ లో చాలా ప్రత్యేకతలు ఉన్నాయి. 'ఆత్మనిర్భర్' కింద పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన యుద్ధ ట్యాంకులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కవాతు విజయ్‌చౌక్ వద్ద మొదలై ఎర్రకోట వరకు సాగుతుండగా.. దేశీయంగా అభివృద్ధి చేసిన ఆయుధాలు స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచాయి. యావత్ దేశం 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్న శు భసందర్భంగా దేశవాసులకు ప్రధాని నరేంద్ర మోదీ (ఔజీసఽనిటసజీ పనీటతి) ప్రత్యేక శు భాకాంక్షలు తెలిపారు. స్వాతంత్య్ర సమరయోధుల కలలు నిజమవ్వాలంటే ఉమ్మడిగా ముందుకుసాగాలని దేశవాసులకు సందేశమిచ్చారు. ఈ మేరకు ప్రత్యేకంగా ట్వీట్ చేశారు. ' భారతీయులు అందరికీ రిపబ్లిక్ డే శుభాకాంక్షలు. స్వాతంత్య్ర అమృత్ మహోత్సవ్ సమయంలో జరుపుకుంటున్న ఈ గణతంత్ర దినోత్సవం విశిష్టమైనది. దేశం కోసం అసువులుబాసిన స్వాతంత్య్ర సమరయోధుల కలలు నిజం కావాలంటే ఉమ్మడిగా ముందుకు సాగాలని కోరుకుంటున్నాను‘ అని పేర్కొన్నారు. ఈ మేరకు హిందీలో ఆయన ట్వీట్ చేశారు.



# ప్రజాస్వామ్య బద్ధంగా తెలంగాణ పాలన



(మొదటి పేజి తరువాయి) చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, పోచారం మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో ప్రజాస్వామ్యం అమలవుతున్నదని గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ఉన్నత బాధ్యతల్లో ఉన్నవాళ్లు తెలంగాణ అభివృద్ధిని గమనించకపోవడం బాధాకరమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించేవారు కేంద్రం ఏం చేసిందో కూడా చెప్పాల్సి ఉంటుందన్నారు. కేంద్రం ఏం చేసిందని అడిగితే.. జాతీయ రహదారుల గురించి మాత్రమే మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణలో అందరూ సంతోషంగా ఉన్నారని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కొందరికి కనపడకపోతే చేసేదేం లేదన్నారు. వ్యవసాయ క్షేత్రాలను, కొత్త భవనాలను విమర్శించడం తగదన్నారు. స్వాతంత్ర్యం, రాజ్యాంగం ఏ ఒక్కరి సొత్తు కాదని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. దేశాన్ని పాలించే వ్యక్తులు రాజ్యాంగ స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. రాజ్యాంగం కులం, మతాలది కాదు.. ఒక గ్రంథం లాంటిదని చెప్పారు. రాజకీయ పార్టీలు విమర్శలకే పరిమితం కావొద్దని హితవు పలికారు. రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో ఉన్నప్పుడు బాధ్యతగా ఉండాలని, మైకులు అందగానే ఆరోపణలు చేయొద్దని సూచించారు. స్పీకర్ అయినా, ప్రధాని అయినా రాజ్యాంగం పరిధిలోనే పదవులు వచ్చాయని, కొంతమంది కళ్లలో సంతోషం కోసం పరిపాలన చేయొద్దని వెల్లడించారు. అది రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. దేశ సంపద కొద్దిమంది చేతుల్లోనే ఉందని, పేదలకు పెద్ద పీట వేయాలన్నారు. 74 ఏండ్ల తర్వాత కూడా పేదలు ఉన్నారని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం అందుతున్నదని స్పీకర్ పోచారం చెప్పారు. ఎవరి బాధ్యత ఏంటో చెప్పినదే రాజ్యాంగం అని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో ఉన్నప్పుడు బాధ్యతగా ఉండాలి. మైకులు అందగానే ఆరోపణలు చేయొద్దు. స్పీకర్ అయినా– ప్రధాని అయినా రాజ్యాంగం పరిధిలోనే పదవులు వచ్చాయి. ఇవాళ కొన్ని సంఘటనలు చూస్తుంటే బాధేస్తోంది. పేదోదు పేదోడిగానే ఉన్నాడు. ఉన్నోడు.. ఉన్నోడిగానే ఉన్నాడు. దేశ సంపద కొంత మంది చేతుల్లోనే ఉంది. పేదలకు పెద్ద పీట వేయాలన్నారు.

# ప్రగతిభవన్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు



(మొదటి పేజి తరువాయి) సమానత్వంతో కూడిన సమర్ధ, ప్రజాస్వామిక పాలన ద్వారానే దేశ రా జ్యాంగం ఆశించిన లక్ష్యం పరిపూర్ణంగా సిద్ధిస్తుందని తెలిపారు. సర్వసత్తాక, గణతంత్ర, ప్రజాస్వామిక దేశంగా భారత్‌లో రాజ్యాంగబద్ధ పాలనకు అంకురార్పణ జరిగిన ఈ రోజు దేశ పౌరులందరికీ పండుగ దినమని పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాతల కృషిని ప్రజలు సదా స్మరించుకొంటారని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, సత్యవతి రాథోడ్, మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, నవీన్ రావు, శంభీపూర్ రాజు, మధుసూధనా చారి, సీఎస్ శాంతి కుమారి, డీజీపీ అంజనీ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# టీ20 క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డుకు సూర్యకుమార్



**దుబాయ్, జనవరి 26 (సమ సమాజం):** స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ ఐసీసీ పురుషుల 'టీ20 క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డుకు ఎంపికయ్యాడు. గత ఏడాది పొట్టి క్రికెట్‌లో ఎన్నో రికార్డులు బద్దలుగొట్టిన సూర్య.. ఇంగ్లండ్ యువ ఆటగాడు సామ్ కర్రాన్, పాకిస్థాన్ బ్యాటర్ మహ్మద్ రిజ్వాన్, జింబాబ్వే ఆల్‌రౌండర్ సికిందర్ రజాను వెనక్కు నెట్టి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం దక్కించుకున్నాడు. ఇక భారత మహిళల పేస్ బౌలింగ్‌లో సరికొత్త తార రేణుకా సింగ్ ఐసీసీ 'ఎమర్జింగ్ ఉమెన్ క్రికెట్ ఆఫ్ ద ఇయర్' అవార్డు సొంతం చేసుకుంది. మహిళల టీ 20 క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు ఆస్ట్రేలియాకు చెందిన తహీల మెక్‌గ్రాత్‌ను వరించింది. క్రికెట్ ప్రపంచం ముద్దుగా 'స్కై' (ఎస్‌కేవై) అని పిలుచుకొనే 32 ఏళ్ల సూర్యకుమార్ యాదవ్ గత సంవత్సరం టీ20లలో ఏకంగా 187.43 స్ట్రయిక్ రేట్‌తో 1164 రన్స్ సాధించి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈక్రమంలో ఒక క్యాలెండర్ ఏడాదిలో వేయి పరుగులు చేసిన రెండో క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పాడు. గత ఏడాది 68 సిక్సర్లు బాదిన అతడు టీ20 క్రికెట్ చరిత్రలో ఒక సంవత్సరం అత్యధిక సిక్సర్లు కొట్టిన బ్యాటర్‌గా మరో రికార్డు నెలకొల్పాడు.

# తెలంగాణ పోలీసులు పనితీరు భేష్

## ప్రశంసించిన డిజిపి అంజనీకుమార్



**హైదరాబాద్, జనవరి 26 (సమ సమాజం):** ఖమ్మంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో పోలీస్ అధికారులు అత్యంత అద్భుతంగా పనితీరును కనబరిచారని రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్ ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ప్రతి జిల్లాలోని పోలీసు యూనిట్లు సమష్టిగా పనిచేస్తూ, అద్భుతమైన పనితీరుని కనబరుస్తారని వెల్లడించారు. పోలీస్ యూనిట్ల మధ్య ఉండాల్సింది పోటీతత్వం కాదు. ఐక్యమత్యం ఉండాలని ' అన్నారు. ఒక్క జిల్లాను మరో జిల్లాలతో పోల్చుకోలేమని, దేనికి దాని ప్రత్యేకమైన యూనిట్ ఉంటుందని పేర్కొన్నారు.ఆ జిల్లాకు సంబంధించిన బలాలు, బలహీనతలు అక్కడి పోలీస్ యూనిట్ ఉన్నత అధికారులకు తప్పక తెలుస్తుందని అన్నారు. పోలీస్ శాఖలో ఓ యూనిట్ నుంచి మరో యూనిట్ మధ్యలో పోటీ తత్వం ఉండకూడదని,తమ యూనిట్ పరిధిలోని కష్టనష్టాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని వెల్లడించారు. ప్రజలకు శాంతి భద్రత ఎటువంటి విఘాతం వాటిల్లకుండా తగు చర్యలు తీసుకోవాలని వివరించారు. నూతనంగా ఐపీఎస్ అధికారులుగా నియమితులైన అధికారులు నూతన ఉత్తేజంతో ముందుకు సాగుతున్నారని అన్నారు.ఐజీలు కూడా తమ పరిధిలోని యూనిట్లను ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తూ ముందుకు సాగేలా చర్యలు తీసుకుంటున్నారని డీజీపీ కొనియాడారు.

# మళ్లీ బ్యాట్ పట్టిన ధోనీ

## నెట్ ప్రాక్టీస్‌లో పాల్గొన్న క్రికెటర్

**రాంచీ, జనవరి 26 (సమ సమాజం):** రెండు, మూడు నెలల్లో ప్రారంభం కాబోయే ఐపీఎల్ 2023లో ఎంఎస్ ధోనీ ఆడతాడో, లేదోననే ఆందోళనలో ఆయన ఫ్యాన్స్ ఉన్నారు. ఈ క్రమంలో ఎంఎస్ ధోనీ తన అభిమానులకు గుడ్ న్యూస్ అందించారు. చాలా రోజుల తర్వాత ధోనీ బ్యాట్ పట్టి నెట్‌లో ప్రాక్టీస్ చేశాడు. రాంచీలోని జార్ఖండ్ క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో ధోనీ తన ఆటకు పదును పెట్టాడు. ధోనీ ప్రాక్టీస్‌కు సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ట్రెండింగ్‌లోనూ ఉంది. గతంలో చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు నాలుగు సార్లు ఐపీఎల్ ట్రోఫీని అందించిన మిస్టర్ కూల్.. ఎట్టకేలకు ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఇక ఐపీఎల్ 2022లో విఫలమైన సీఎస్‌కే.. ఈ సారి ఎలాగైనా ఛాంపియన్‌గా నిలవాలని పట్టుదలతో ఉంది. దాని కోసం ఇప్పటికే మినీ వేలంలో ఆల్ రౌండర్ బెన్ స్టోక్స్‌ను రూ. 16.25 కోట్లకు కొనుగోలు చేసింది. సీఎస్‌కే జట్టులో ధోనీ, రవీంద్ర జడేజా, దీపక్ చాహర్, అంబటి రాయుడు, రుతురాజ్ వంటి కీలక ఆటగాళ్లు ఉన్నారు.



# ఐసీసీ మెన్స్ అవార్డుల్లో

## దుమ్ము రేపుతున్న బాబర్



**లాహోర్, జనవరి 26 (సమ సమాజం):** పాకిస్తాన్ కెప్టెన్ బాబర్ ఆజామ్ ఐసీసీ మెన్స్ అవార్డుల్లో దుమ్ము రేపుతున్నాడు. బుధవారం ప్రకటించిన ఐసీసీ అవార్డుల్లో ఐసీసీ వన్డే క్రికెటర్ ఆఫ్ ది ఇయర్-2022, ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ 2022 అవార్డులు గెలుచుకున్నాడు. గతేడాది అంతర్జాతీయ క్రికెట్లో అద్భుత ప్రదర్శన చేసిన బాబర్, 9 వన్డేల్లో 679 రన్స్ చేశాడు. ఓవరాల్ గా చూస్తే 2022లో ఆడిన 44 మ్యాచుల్లో 54.12 సగటుతో మొత్తం 2,598 రన్స్ చేశాడు. అందులో 8 సెంచరీలు, 15 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఇంగ్లండ్ టెస్ట్ కెప్టెన్ బెన్ స్టోక్స్ ఐసీసీ మెన్స్ టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్-2022 అవార్డు అందుకున్నాడు. గతేడాది స్టోక్స్ టెస్టుల్లో 26 వికెట్లు పడగొట్టడంతో పాటు 870 రన్స్ చేశాడు.

# నేటినుంచి న్యూజిలాండ్‌తో టీ ట్వంటీ

## గాయంతో యంగ్ ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ దూరం



**రాంచి, జనవరి 26 (సమ సమాజం):** న్యూజిలాండ్ తో జరగబోయే టీ20 సిరీస్ కు ముందు టీమిండియాకు ఎదురుదెబ్బ తగిలింది. యంగ్ ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ మణికట్టుకు గాయం కారణంగా సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. ఈ విషయాన్ని బీసీసీఐ అధికారికంగా ప్రకటించింది. దీంతో పృథ్వీ షా, రాహుల్ త్రిపాఠీలతో పాటు మరికొందరిని బీసీసీఐ రాంచీకి తీసుకెళ్లింది. అయితే, రుతురాజ్ స్థానంలో ఎవరిని జట్టులోకి తీసుకుంటారనేది తెలియాల్సి ఉంది. ఇటీవల జరిగిన రంజీ మ్యాచ్‌లో రుతురాజ్ గాయపడినట్లు తెలుస్తుంది. రంజీల్లో రెచ్చిపోయి ఆడిన రుతురాజ్ ఈ సిరీస్ లో లేకపోవడం టీమిండియాకు లోటు అనే చెప్పొచ్చు. శుక్రవారం నుంచి మొదలుకానున్న టీ20 సిరీస్ కు కెప్టెన్ గా హార్దిక్ పాండ్యా వ్యవహరించనున్నాడు.




# గవర్నర్ చేతుల మీదుగా అవార్డు

## ఆనందంగా ఉందన్న కీరవాణి



సంగీత దర్శకుడు కీరవాణి గురువారం గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉర్రూతలూగించిన 'ఆర్ఆర్ఆర్' చిత్రానికి అవార్డులు రావడం.. వాటిని గవర్నర్ చేతులు మీదగా తీసుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ 'అన్నీ ఆనందించ దగ్గ విషయాలే. పెద్దల ఆశీర్వాదాలతోనే ఇంతటి ఘనత సాధించాం. ఈ ఘనత కేవలం నా కష్టం మాత్రమే కాదు. నాతో పని చేసిన ప్రతి ఒక్కరి విజయం' అని అన్నారు. పద్మశ్రీ పురస్కారం వరించడం పట్ల ఆయన ట్విట్టర్ వేదికగా స్పందించారు. భారత ప్రభుత్వ పౌర పురస్కారం వరించిన సందర్భంగా నా తల్లిదండ్రులతో పాటు నా గురువులు కవితపు సీతమ్మ గారి నుంచి కుప్పాల బుల్లి స్వామి నాయుడు గారి వరకు అందరికీ హృదయపూర్వక ధన్యవదాలు' అని ట్వీట్టర్‌లో పేర్కొన్నారు కీరవాణి. ఇటీవల 'ఆర్ఆర్ఆర్' సినిమాలోని 'నాటు నాటు' పాటకు ఆయన గోల్డెన్ గ్లోబ్ అవార్డు అందుకున్నారు. ఇదే పాట ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే ఆస్కార్ నామినేషన్లలోనూ చోటు దక్కించుకుంది. తాజాగా ఆయన్ను పద్మశ్రీ అవార్డు వరించింది. ఈ సందర్భంగా అభిమానులు సినీ ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.



# వైభవంగా శర్వానంద్ ఎంగేజ్‌మెంట్

## వేడులో పాల్గొన్న చెర్రీ దంపతులు

టాలీవుడ్ మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్స్‌లో ఒకరైన శర్వానంద్ త్వరలో ఓ ఇంటివాడు కాబోతున్నారు. సింగిల్ లైఫ్ జీవితానికి ఇక స్వస్తి చెప్పనున్నారు. రక్షితా రెడ్డితో ఆయన ఏడడుగులు వేయనున్నారు. గురువారం ఆయన నిశ్చితార్థం జరిగింది. ఇరువైపు కుటుంబాల సమక్షంలో హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో వైభవంగా నిశ్చితార్థం జరిగింది. ఈ వేడుకకు శర్వానంద్ క్లోజ్ ఫ్రెండ్ రామ్‌చరణ్, ఆయన సతీమణి, ఉపాసన తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. దీనికి సంబంధించిన ఫొటోలను శర్వానంద్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. నెటిజన్లు, శర్వా అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు చెబుతున్నారు. అయితే ఈరోజే వీరిద్దరి నిశ్చితార్థం అంగరంగ వైభవంగా జరుగుతోంది. గురువారం ఉదయం 11.04 నిమిషాలకు శర్వానంద్ రక్షితలు ఉంగరాలు మార్చుకున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12లోని హుడా హైట్స్ లో వీరి ఎంగేజ్ మెంట్ బంధువులు స్నేహితుల మధ్య సాగింది. ఈ క్రమంలోనే శర్వానంద్ బెస్ట్ ఫ్రెండ్ అయిన్ మెగా పవర్ స్టార్ రామ్ చరణ్.. తన భార్య ఉపాసనతో కలిసి ఈ వేడుకకు హాజరు అయ్యాడు. కాబోయే వధూవరిలిద్దరితో కలిసి ఫొటో కూడా దిగారు. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి. ఆఫ్ వైట్ కూర్తా లో శర్వా మిలమిలా మెరిసిపోతుండగా... స్కై బ్లూ కలర్ డిజైనర్ పట్టు చీరలో రక్షిత చందమామ కనిపిస్తోంది.చరణ్ అండ్ ఉపాసన బేబీ పింక్ కలర్ మ్యాచింగ్ బట్టలు వేసుకొని శర్వానంద్ ఎంగేజ్ మెంట్ లో క్యూట్ గా కనిపించారు. ఈ ఫొటోలు చూసిన అభిమాలు శర్వా రక్షితలు కంగ్రాట్స్ చెబుతున్నారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in